# నన్ను పక్కన పెట్టేశారు!



**1990వ** దశకంలో దేశంలో అగ్ర కథానాయికల్లో ఒకరిగా వెలిగింది మీనాక్షి శేషాద్రి. ఒకదశలో అత్యధిక పారితోషికం అందుకున్న హీరోయిన్‌గానూ నిలిచింది. తాజాగా ఓ ఆన్‌లైన్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన సినిమా జీవితాన్ని మలుపు తిప్పిన ఓ సంఘటన గురించి అభిమానులతో పంచుకున్నది. 1985లో వచ్చిన 'మేరీ జంగ్' సినిమా.. మీనాక్షి సినీ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. ఈ చిత్రంలో మీనాక్షి వేసింది చిన్నపాత్రే అయినా.. నటిగా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. తనలో బహుముఖ ప్రతిభను వెలికి తీసింది. అయితే, ఈ చిత్ర దర్శకుడు సుభాష్ ఘాయ్‌తో తనకు మంచి అనుబంధం ఉండేదనీ, ఒక చిన్న అపార్థం.. తమ మధ్య వృత్తిపరమైన సంబంధాన్ని తీవ్రంగా దెబ్బతీసిందనీ చెప్పుకొచ్చింది. ''మేరీ జంగ్ చిత్రంలో నేను పోషించింది చిన్నపాత్రే అయినా నాకు మంచి పేరు తీసుకొచ్చింది. అంత ప్రాధాన్యత లేకపోయినా.. దర్శకుడు సుభాష్ నన్ను బాగా హైలైట్ చేశారు. సినిమాల్లో చిన్నపాత్రలే కీరోల్ ప్లే చేస్తాయనీ, ప్రేక్షకులకు దగ్గర చేస్తాయనీ ఆయన ఎప్పుడూ చెబుతుండేవారు. నా విషయంలోనూ అదే జరిగింది!'' అంటూ నాటి విషయాలను పంచుకున్నది మీనాక్షి. నిజానికి దర్శకుడు సుభాష్ ఘాయ్.. తన చిత్రాల్లో మీనాక్షికి పెద్దపెద్ద పాత్రలు ఇవ్వాలని అనుకునేవాడట. కానీ, తను ఆయన అంచనాలను అందుకోలేకపోయిందట. అదే విషయం చెబుతూ.. ''అప్పటికి నేను చాలా చిన్నదాన్ని. ఇండస్ట్రీలో ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలియదు. అదే సమయంలో నాకూ సుభాష్‌కూ మధ్య చిన్నచిన్న మనస్పర్థలు ఏర్పడ్డాయి. మా ఇద్దరి మధ్యా వృత్తిపరమైన సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దాంతో ఆయన నన్ను పక్కనపెట్టేశారు. వేరేవాళ్లతో మంచి హిట్స్ కొట్టారు కూడా! అప్పటి నుంచి నా కెరీర్ ఎన్నో ఒడుదొడుకులకు గురైంది!'' అంటూ చెప్పుకొచ్చింది మీనాక్షి శేషాద్రి. 'దామిని' చిత్రంతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన మీనాక్షి.. 'బ్రహ్మర్షి విశ్వామిత్ర'తో టాలీవుడ్‌ను పలకరించింది. చిరంజీవి హీరోగా వచ్చిన 'ఆపద్బాంధవుడు'తో తెలుగువారికి మరింత దగ్గరైంది.


నమస్తే తెలంగాణ
జిందగీ
11
హైదరాబాద్ | ఆదివారం 3 నవంబర్ 2024 www.ntnews.com






# ప్రతి ఒక్కడూ సమీక్షకుడే

**సినిమా** సమీక్షకులపై నిరసనలు పెరుగుతున్నాయి. ఇటీవలే టాలీవుడ్ నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ రివ్యూయర్లపై నోరు పారేసుకోగా.. తాజాగా బాలీవుడ్ కథా రచయిత్రి కనిక ధిల్లాన్ కూడా మండిపడ్డారు. తన తాజా చిత్రం 'దో పట్టి'పై కొందరు ప్రతికూల సమీక్షలు రాశారు. హిందీ చిత్రసీమలో విభిన్నమైన కథలను అందిస్తున్న రచయిత్రిగా పేరున్న కనిక.. ఈ నెగెటివ్ రివ్యూలపై స్పందించారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అదే విషయమై మాట్లాడారు. ''ప్రేక్షకులకు మంచి సినిమా అందించడానికి ఏమేం చేయాలో.. అన్నీ చేస్తాం. వారు ఆ సినిమాను చూసి.. అందులోని సందేశాన్ని గ్రహిస్తే చాలని కోరుకుంటాం. అసలు మేం సినిమాలు చేసేదే ప్రేక్షకుల కోసం. మధ్యలో ఈ సమీక్షకులు ఎవరు? మేం వారి కోసం సినిమా చేయడం లేదు. నిజానికి సగటు ప్రేక్షకులు ఓపెన్ మైండెడ్‌గానే ఉంటున్నారు. ఈ సమీక్షలు చేసే వాళ్లే మరీ లోతుగా వెళ్తున్నారు. ఈకాలంలో సోషల్ మీడియాను వాడుతున్న ప్రతి ఒక్కరూ సినిమా సమీక్షకులు అయిపోతున్నారు. వారి సొంత అభిప్రాయాలను సినిమాలపై రుద్దేస్తున్నారు. నిష్పక్షపాతంగా సమీక్ష రాసే వాళ్లు చాలా తక్కువగా కనిపిస్తున్నారు. కొందరైతే సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావాలని వ్యక్తిగత విమర్శలకూ దిగుతున్నారు. ఇది ఏమాత్రం ఉపేక్షించదగిన విషయం కాదు'' అంటూ సమీక్షకుల తీరుపై కనిక మండిపడ్డారు. కాజోల్, కృతి సనన్ కీలక పాత్రల్లో నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ చిత్రానికి కనిక కథను అందించడంతో పాటు నిర్మాతగానూ వ్యవహరించారు.

## డ్రెస్ మోజు అదొక్కటేనా!

**1999లో** వచ్చిన 'దిల్బర్ దిల్బర్' పాటకున్న క్రేజే వేరు. మిస్ యూనివర్స్ సుస్మితా సేన్ ఆడిపాడిన ఈ పాటకు ఫిదా అవ్వని నాటి తరం కుర్రకారు లేరు. అయితే.. 2018లో 'సత్యమేవ జయతే' సినిమా కోసం ఈ పాటను రీమిక్స్ చేశారు. ఇందులో బాలీవుడ్ ఐటమ్ గర్ల్ నోరా ఫతేహి వేసిన స్టెప్పులకు నేటితరం కుర్రాళ్లు నోరెళ్లబెట్టారు. అయితే.. ఈ పాట కోసం తాను ధరించాల్సిన డ్రెస్ మరీ పొట్టిగా ఉండటంతో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందట నోరా. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో నాటి సంగతులను చెప్పుకొచ్చింది. 'దిల్బర్ దిల్బర్' పాట రీమిక్స్ అనగానే నోరా ఎగిరి గంతేసిందట. దీన్ని మామూలు ఐటం సాంగ్స్‌లా కాకుండా.. ప్రత్యేకంగా చేయాలనుకున్నదట. ఆమాటే ఆ చిత్ర నిర్వాహకులతోనూ చెప్పిందట. కానీ, అప్పుడు వాళ్లు ఇచ్చిన కాస్ట్యూమ్స్ చూసి ఒక్కసారిగా అవాక్కయ్యిందట. ''వాళ్లిచ్చిన జాకెట్ చాలా చిన్నగా ఉంది. నాకు ఏమాత్రం నచ్చలేదు. నన్ను మరీ అంత సెక్సువలైజ్ చేసి చూపించకండని వారికి చెప్పాను. చేసేది సెక్సీ సాంగే అయినా.. మరీ అసభ్యకరంగా ఉండొద్దని కోరాను. ఇంత చిన్న బట్టలు వేసుకోలేను.. ఇంకేమైనా ఇవ్వండని అడిగాను. తర్వాతి రోజు మరో బ్లౌజ్ రెడీ చేశారు. అది కూడా చిన్నగానే అనిపించొచ్చు. కానీ, ముందు ఇచ్చినదాని కంటే అది ఎంతో మెరుగ్గానే ఉంది!'' అని నోరా ఫతేహి చెప్పుకొచ్చింది. తనకు ఏమాత్రం ఇష్టం లేకున్నా.. తానేంటో నిరూపించుకోవాలనే ఆ సాంగ్‌లో నటించానని చెబుతున్నది నోరా. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. కెనడాకు చెందిన ఈ యాక్టర్ కమ్ డ్యాన్సర్.. తన అందం, నృత్యంతో అభిమానులను అలరిస్తున్నది. బాహుబలి-1లోనూ 'మనోహరా..' పాటలో మెరిసి.. తెలుగు వారికి పరిచయమైంది. ప్రస్తుతం వరుణ్ తేజ్ హీరోగా వస్తున్న 'మట్కా'లోనూ నటిస్తున్నది.

# జయ హనుమంతా సినీ బలవంతా!



సినిమాల్లో..
రాముడు సూపర్ హిట్.
కృష్ణుడు బంపర్ హిట్.
వేంకటేశ్వరుడు, శివుడు అందరూ మెగా హిట్టే.

**ఇలా సిల్వర్ స్క్రీన్‌పై వెలిగిన వేల్పులంతా నిర్మాతకు లక్ష్మీదేవిని అనుగ్రహించిన వారే! వీరందరినీ మించిన వెండితెర వీరుడు వీరహనుమంతుడు. ఈ చిరంజీవి పాత్రను రామాయణ కథలోనే కాదు.. ద్వాపరం నాటి కృష్ణగాథల్లోనూ చూపించి ప్రేక్షకుల మెప్పు పొందారు దర్శక నిర్మాతలు. హనుమ చుట్టూ కథలు అల్లుకొని.. బాక్సాఫీస్ రికార్డులు సొంతం చేసుకున్నారు. ఎందుకంటే ఆంజనేయుడి పాత్ర ప్రవేశంతోనే కథనంలో వేగం పెరుగుతుంది. ప్రేక్షకుల్లో ఉత్సుకత హెచ్చుతుంది. అందుకే ఆయన్ను సక్సెస్ ఫార్ములాగా భావిస్తుంటారు సినీజనం. ఇటీవల 'హను-మాన్' పేరుతో ఇండస్ట్రీ హిట్ కొట్టారు. దీనికి సీక్వెల్‌గా సిద్ధమవుతున్న 'జై హనుమాన్'పై షూటింగ్ నుంచే కొండంత అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో ఆంజనేయుడిగా కాంతార ఫేమ్ రిషభ్ శెట్టి కనిపించనున్నాడు. అందుకు సంబంధించిన స్టిల్ విడుదల అయ్యీ కావడంతోనే లంక దాటేంతలా వైరల్ అయ్యిందంటే హనుమంతుడి బలమెంతో అర్థం చేసుకోవచ్చు.**

ఎన్నిసార్లు విన్నా, ఎంత చదివినా తనివితీరని గాథ.. రామకథ. అదో వజ్రభాండాగారం. అందులో వెలకట్టలేని మేలి వజ్రం ఆంజనేయుడు. నామస్మరణ మాత్రం చేత హృదయాలను సుందరమయం చేసే దివ్య ఔషధం హనుమ నామం. అందుకే ఆ కపివరుణ్ని 'రామాయణ మహామాలా రత్నం' అన్నారు. నిజానికి రామాయణంలో రాముడితో సరిసమానమైన వీరుడెవరన్నా ఉంటే అది హనుమంతుడు మాత్రమే. సకల గుణవంతుడు, సర్వ శక్తిమంతుడు అయిన హనుమను రుద్రాంశ సంభూతుడిగా భావిస్తారు. చూసి రమ్మంటే కాల్చొచ్చే రకం కూడానూ! రామాజ్ఞ లేదు కానీ, ఆనతి ఇచ్చి ఉంటే.. లంకకు నిప్పెట్టినప్పుడే రావణుని పని కూడా ప్రశాంతంగా ముగించేసేవాడే!! ఇంతటి వీరుడు కాబట్టే.. ఆంజనేయుడిపై వచ్చినన్ని కల్పిత కథలు మరే పురాణ పాత్రమీదా రాలేదు. నాటక కర్తలు, సినీ రచయితలు సైతం జనాన్ని ఆనందింపజేయడానికి హనుమ చుట్టూ ఎన్నో కథలు అల్లారు. రామాంజనేయ యుద్ధం, కృష్ణాంజనేయ యుద్ధం, భీమాంజనేయ యుద్ధం, అర్జున గర్వభంగం, బలరామ గర్వభంగం, గరుడ గర్వభంగం, శనీశ్వర గర్వభంగం.. ఇవన్నీ అలా పుట్టిన కథలే. వీటిలో కొన్ని సినిమాలుగా కూడా వచ్చాయి. మరికొన్ని నాటకాలుగా ప్రాచుర్యం పొందాయి.

**మన** సినిమా రచయితలు.. రాముణ్ని ప్రేరణగా తీసుకొని హీరో పాత్రల్ని అల్లేస్తుంటారు. కానీ, హాలీవుడ్‌లో మాత్రం ఆంజనేయుడి నుంచి స్ఫూర్తి పొందారేమో అనిపిస్తుంది. సూపర్‌మ్యాన్, స్పైడర్ మ్యాన్, హీమాన్.. ఈ సూపర్‌హీరోల పాత్రలకు మూలం మన హను'మ్యానే'! హనుమంతుడి పాత్రలో అలవికాని హీరోఇజం చూపించే ఇదున్నా.. మన హీరోలు మాత్రం ఆ పాత్ర పోషించడానికి ధైర్యం చేయలేదు. కారణం, వానరుడు కనుక తోక సహజం. పైగా పెదవులు ఉబ్బెత్తుగా ఉండటం వల్ల గ్లామర్‌గా కనిపించమనే ఫీలింగ్! దీనికితోడు హనుమయ్య అస్ఖలిత బ్రహ్మచారి. కాబట్టి డ్యూయెట్లకు అవకాశం ఉండదు. అందుకే మన హీరోలు ఆంజనేయుడికి ఆమడ దూరం పాటిస్తూ వచ్చారు. దేవుడి పాత్రలకు పేరెన్నికగన్న ఎన్టీయార్ కూడా హనుమ జోలికి వెళ్లలేదు. ఆ స్థాయి హీరో ఎవరైనా ఆంజనేయుడిగా కనిపించాడంటే అది చిరంజీవి ఒక్కడే! 'జగదేక వీరుడు అతిలోక సుందరి' సినిమాలో కాసేపు హనుమంతుడిగా కనిపించి, అభిమానుల్ని మురిపించారు. 'హనుమాన్' అనే యానిమేషన్ ఫిల్మ్‌లో హనుమంతుడి పాత్రకు డబ్బింగ్ కూడా చెప్పారు. చిరంజీవి స్వతహాగా హనుమంతుని భక్తుడు. అందుకే ఆ అవకాశాలను మహద్భాగ్యాలుగా భావించాడేమో! అలాగే 'దేవుళ్లు' సినిమాలో రాజేంద్రప్రసాద్, 'శ్రీ ఆంజనేయం' చిత్రంలో అర్జున్ మానవరూపాన్ని దాల్చిన హనుమంతులుగా అదరగొట్టారు.

> ''92ఏండ్ల తెలుగు సినిమా చరిత్రలో హనుమంతుడిగా తెరపై పూర్తి స్థాయిలో నటించిన హీరో లేడన్నది నిజం. అయితే.. ఇన్నాళ్లకు రిషభ్ శెట్టి కనిపించబోతున్నాడు. 'హను-మాన్'తో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టిన దర్శకుడు ప్రశాంత్‌వర్మ.. ఆ సినిమాకు సీక్వెల్‌గా చేస్తున్న 'జై హనుమాన్' చిత్రంలో రిషభ్ శెట్టి హనుమంతుడిగా కనిపించనున్నారు. తాజాగా ఆయన స్టిల్స్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఆ ఫొటోలు ప్రస్తుతం బాగా వైరల్ అవుతున్నాయి. ఆ విధంగా కన్నడిగుడైన రిషభ్ శెట్టి.. తెలుగు తెరపై పూర్తిస్థాయిలో హనుమంతుడిగా కనిపించబోతున్న తొలి హీరో అన్నమాట!''

**హనుమంతుడి** నేపథ్యంలో ఉండే సన్నివేశాలు ప్రేక్షకులు అమితంగా ఇష్టపడుతుంటారు. ఆ సన్నివేశాలను చూస్తున్నప్పుడు ఏదో తెలియని ఆనందం కలుగుతుంది. 'లవకుశ' సినిమాలో కుశలవుల చేతిలో లక్ష్మణ, శత్రుఘ్నులు ఓడిపోయాక, స్వయంగా రాముడే యుద్ధానికి విచ్చేసే సన్నివేశాన్ని తేలిగ్గా మరిచిపోగలమా!? ఆ సన్నివేశంలో రథంపై వస్తున్న రాముడి పక్కన హనుమంతుణ్ని చూస్తే రోమాలు నిక్కబొడుస్తాయి. ఆ పాత్ర చేసిన నటుడి పేరు తెలియకపోయినా.. ఆయన అభినయం మాత్రం ఇప్పటికీ జన హృదయాల్లో నిలిచే ఉంది. అలాగే 'పాండవ వనవాసం' చిత్రంలో భీమసేనుణ్ని.. ఆంజనేయుడు పరీక్షించే సన్నివేశం అజరామరం. ఆ సీన్‌లో ఆంజనేయుడిగా కనిపించిన ఆ నటుడి రూపం.. ఆ విశ్వరూపం.. ఆ సన్నివేశంలో భీమసేనుడిగా ఎన్టీఆర్ అభినయం.. 'ఆంజనేయా.. మహానుభావా..' అంటూ ఘంటసాల గంభీర గానం.. ఇవన్నీ తెలుగు ప్రేక్షకులు మరువలేని జ్ఞాపకాలు. ఎన్టీఆర్ 'సూపర్‌మ్యాన్' సినిమాలో హనుమంతుడి ఎపిసోడ్ ఇప్పటికీ మెమొరబుల్. అప్పట్లో పిల్లలు విపరీతంగా ఎంజాయ్ చేసిన సన్నివేశాలు అవి. అలాగే బాపు 'ముత్యాలముగ్గు'లో హనుమ పాత్ర ఎప్పటికీ తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకమే.

**ఇక** హనుమంతుడిగా మెప్పించిన నటదిగ్గజాలను గుర్తు చేసుకుంటే.. ముందు చెప్పుకోవాల్సిన పేరు అర్జా జనార్దన్‌రావు. బలిష్ఠమైన దేహంతో హనుమంతుడిగా ఆయన తెరపై కనిపిస్తే.. అచ్చుగుద్దినట్టు ఆంజనేయ స్వామిలాగే అనిపించేవారు. దానికితోడు అద్భుతమైన నటనాపటిమ.. ఆయన్ను వెండితెర వీరాంజనేయుడ్ని చేసింది. బాపు దర్శకత్వంలో వచ్చిన సంపూర్ణ రామాయణం, రామాంజనేయ యుద్ధం, ముత్యాలముగ్గు, కె.వి.రెడ్డి దర్శకత్వంలో వచ్చిన 'శ్రీకృష్ణసత్య' చిత్రాలు ఆంజనేయుడిగా ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. కమ



లాకర కామేశ్వరరావు దర్శకత్వంలో వచ్చిన 'వీరాంజనేయ' చిత్రంలో హీరోగా కూడా నటించారు అర్జా జనార్దనరావు. ఆయన ఆంజనేయుడిగా నటించిన కొన్ని తమిళ చిత్రాలు కూడా తెలుగులో డబ్ అయ్యాయి. ఒక్క తెలుగులోనే కాదు, భారతదేశంలోనే ఆంజనేయుడిగా ఎక్కువ చిత్రాల్లో నటించిన నటుడు అర్జా జనార్దన్‌రావు.

**జనార్దన్‌రావు** తర్వాత హనుమ పాత్రలో చెప్పుకోదగ్గ పేరు సాధించింది రాజనాల. నిజానికి ఆయన ఒకే ఒక్క సినిమాలో హనుమంతుడిగా నటించారు. అదే 'శ్రీకృష్ణాంజనేయ యుద్ధం'. సీఎస్‌రావు దర్శకుడు. ఈ సినిమాలో వీరమారుతిగా విశ్వరూపం చూపించారు రాజనాల. ఆహార్యం విషయంలో జనార్దనరావుకి మార్కులు ఎక్కువ పడొచ్చేమోగానీ.. అభినయం విషయంలో మాత్రం రాజనాలదే పైచేయి. విలన్ పాత్రలు చేసే భీమారావు కూడా కొన్ని సినిమాల్లో హనుమంతుడిగా కనిపించారు. ఇక దేశవ్యాప్త సంచలనం బుల్లితెర 'రామాయణం'. రామానందసాగర్ దర్శకత్వం వహించిన ఈ భారీ ధారావాహికలో హనుమంతుడి పాత్రను ప్రముఖ మల్లయోధుడు, నటుడు దారా సింగ్ పోషించారు. ఓ జనరేషన్‌కి హనుమంతుడు అంటే ఆయనే. తర్వాత ఆయన కుమారుడు విదూ దారాసింగ్ కూడా జై వీరహనుమాన్, విష్ణుపురాణ్, అయోధ్య కీ రామ్‌లీల తదితర సీరియల్స్‌లో హనుమంతుడిగా మెరిశారు. అలాగే తెలుగులో వచ్చిన శ్రీరామదాసు, శ్రీరామరాజ్యం చిత్రాల్లో కూడా ఆయనే హనుమంతుడిగా మెప్పించాడు.

**ఆంజనేయస్వామి** అంటే ఓ ధైర్యం.. ఓ సెంటిమెంట్.. అలాగే చాలామందికి బలహీనత కూడా. ఆయన విజయపతాకాన్ని శుభానికి చిహ్నంగా భావిస్తారు. ముఖ్యంగా పిల్లలకు ఆయనంటే ప్రాణం. 'హను-మాన్' సినిమా అంతటి విజయాన్ని సాధించడానికి కారణం అదే. ఆ సినిమా చివర్లో ఆంజనేయ సాక్షాత్కారాన్ని అద్భుతంగా ఆవిష్కరించాడు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ఆడియన్స్‌ని రోమాంచితుల్ని చేశాడు. అందుకే.. సీక్వెల్ 'జై హనుమాన్' కోసం అందరూ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. నిజానికి హనుమంతుడి ప్రేరణగా ఇంకెన్ని కల్పిత కథలు అల్లినా.. వాటికి జనం బ్రహ్మరథం పడుతూనే ఉంటారు. కారణం.. ఆయన రియల్ సూపర్‌హీరో కాబట్టి!

... బుర్రా నరసింహా

## కట్టిపడేసే.. ఐదో వేదం

### ఐందం వేదం

ఓటీటీ హిట్

**జీ5 :** అక్టోబర్ 25
**తారాగణం :** సాయి ధన్సిక, సంతోష్ ప్రతాప్, వివేక్ రాజగోపాల్, వైవీ మహేంద్ర తదితరులు
**దర్శకత్వం :** ఎల్ నాగరాజన్

**సగటు** ప్రేక్షకుడు థియేటర్‌కు వెళ్లకుండా 'ఓటీటీ'కి ఓటెయ్యాలంటే.. కథలో పస ఉండాల్సిందే! సరికొత్త కాన్సెప్ట్‌తో కట్టిపడేయాల్సిందే! అందుకోసం థ్రిల్లర్ కథాంశానికి ఏదైనా అద్భుతాన్ని జోడించాల్సిందే! 'ఐందం వేదం'లో అదే చేసి సక్సెస్ కొట్టాడు దర్శకుడు. ఇక్కడ థ్రిల్లర్ కథకు మైథాలాజీని జోడిస్తూ వెబ్ సిరీస్‌ను తెరకెక్కించాడు. 'ఐందం వేదం' అంటే.. ఐదో వేదం! మనకు తెలిసిన వేదాలు.. నాలుగే! మరి.. ఈ ఐదో వేదం సంగతేంటి? తెలుసుకోవాలంటే.. కథలోకి వెళ్లాల్సిందే! కోల్‌కతాలో ఉండే తెలుగమ్మాయి అనూ (సాయి ధన్సిక) ఓ స్వేచ్ఛా జీవి. తల్లి అస్థికలను గంగలో కలపడానికి కాశీకి వస్తుంది. అక్కడ ఆమెను ఒక స్వామీజీ కలుస్తాడు. పురాతన కాలంనాటి ఒక చిన్నపెట్టెను ఇచ్చి.. దానిని అయ్యంగారపురంలోని శివాలయ పూజారికి అందజేయమని కోరుతాడు. అనుకోని ప్రమాదం జరిగి.. ఆ స్వామీజీ ఆమె కళ్ల ముందే చనిపోతాడు. అనూ.. ఆ బాక్స్‌ను అక్కడే వదిలేసి వెళ్లిపోదాం అనుకుంటుంది. కానీ, ఊహించని విధంగా ఆ పెట్టె మళ్లీ ఆమె దగ్గరికే చేరుతుంది. తన కెరీర్‌కు సంబంధించిన విషయమై.. త్రివేంద్రం వెళ్దాం అనుకుంటుంది. కానీ, తన ప్రమేయం లేకుండానే అయ్యంగారపురం చేరుకుంటుంది. శివాలయానికి వెళ్లి పూజారికి పెట్టెను ఇవ్వబోతే.. అతను దానిని తీసుకోడు. పూజారి కొడుక్కు ఆ పెట్టెను ఇచ్చేస్తుంది. ఇక ఆ ఊరు వదిలి వెళ్లిపోవాలనుకుంటుంది. కానీ, అందుకోసం ఆమె చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవుతాయి. అనూ.. అయ్యంగారపురంలోనే చిక్కుకుంటుంది. ఆమెకు ఎదురైన వింత సంఘటనల వెనకున్న పరమార్థం ఏమిటి? వేదాలకు – ఆ పెట్టెకు ఉన్న సంబంధం ఏమిటి? లాంటి ప్రశ్నలకు సమాధానమే.. ఐందం వేదం!



